
నేటి దినపత్రిక
సూర్య
18 వ వసంతంలోకి
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు
శుక్రవారం | 20 డిసెంబర్ 2024 | పేజీలు 8

# చంద్రబాబుతో అబ్దుల్ అజీజ్ భేటీ



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** ఆంధ్ర రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ చైర్మన్, నెల్లూరు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు అబ్దుల్ అజీజ్ పురపాలక శాఖ మంత్రి నారాయణతో కలిసి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో సచివాలయంలోని ఆయన ఛాంబర్‌లో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వక్ఫ్ బోర్డ్ నిర్వహణ, తదితర కీలక అంశాలపై అబ్దుల్ అజీజ్ చంద్రబాబు తో చర్చించారు. వక్ఫ్‌బోర్డ్ నిర్వహణతో కూటమి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని అబ్దుల్ అజీజ్‌కు చంద్రబాబు సూచించారు. అనంతరం అబ్దుల్ అజీజ్ మంత్రులు పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణ రెడ్డి, ఎన్ఎండీ ఫరూక్, నాదెండ్ల మనోహర్‌లతో భేటీ అయ్యారు.

### టిడ్కో గృహాలు అందుకున్నవారు

# గృహ ప్రవేశాలు చేయండి

### కమిషనర్ సూర్యతేజ



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో టిడ్కో గృహాల తాళాలు అందుకున్న లబ్ధిదారులంతా ఈనెల చివరి నాటికి గృహప్రవేశాలు చేయాలని కమిషనర్ సూర్యతేజ సూచించారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన ద్వారా వివరాలను తెలియజేస్తూ.. టిడ్కో గృహాల ప్రాంగణాలలో నూతనంగా వీధి దీపాలను ఏర్పాటు చేశామని, పారిశుద్ధ్య కార్మికులకు నిరంతరం విధులు కేటాయించి ప్రాంగణాలన్నిటిని అత్యంత పరిశుభ్రంగా తీర్చిదిద్దామని ప్రకటించారు. సుమారు 6 వేల మంది తాళాలు అందుకున్న గృహాల లబ్ధిదారులు ఇంకను గృహప్రవేశాలు చేయలేదని, వారంతా గృహాలలో నివాసం ఏర్పాటు చేసుకుంటే అన్ని మౌలిక వసతులు, రక్షణ చర్యలు కల్పించే పనులను మరింత వేగవంతం చేస్తామని కమిషనర్ స్పష్టం చేశారు. గృహాలు అందుకున్న యజమానులు అందరూ వీలున్నంత త్వరగా తమకు కేటాయించిన ఇండ్లలో ప్రవేశం చేసి సొంత ఇంటి కలను సాకారం చేసుకోవాలని కమిషనర్ ఆకాంక్షించారు.

### అన్నా క్యాంటీన్‌లను

# ప్రతిరోజు పర్యవేక్షించండి

### అదనపు కమిషనర్ నందన్



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ లో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్లను సచివాలయ మహిళా ప్రొటెక్షన్, ఆమెనిటీస్ కార్యదర్శులు ప్రతిరోజు పర్యవేక్షించాలని అదనపు కమిషనర్ నందన్ ఆదేశించారు. హారనాథపురం కూడలిలోని అన్నా క్యాంటీన్‌ను అదనపు కమిషనర్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా క్యాంటీన్‌లో ప్రజలకు అందుతున్న భోజన నాణ్యత, తాగునీరు, వంటశాల నిర్వహణ తదితర అంశాలను అదనపు కమిషనర్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సచివాలయ కార్యదర్శులు ప్రతిరోజు తనిఖీ చేసి నాణ్యత, మోతాదు తదితర అంశాలను క్రమం తప్పకుండా, క్షుణ్ణంగా పరిశీలించి నివేదికలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు అందజేయాలని ఆదేశించారు.

### నుడా ప్రతిష్టను పెంచేందుకు అధికారులు సహకరించాలి



2లో..

# అన్నదాతలకు అండగా ఉంటా !

- వైసీపీ అరాచకాలను ఎండగడతా..
- నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే నా ధ్యేయం
- సాగునీటి సంఘాల ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాం
- అన్నదాతలందరికీ ప్రత్యేక ధన్యవాదాలు
- ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్




***కలిగిరి, మేజర్‌న్యూస్ :*** నియోజకవర్గంలో సాగునీటి సహా సంఘాల ఎన్నికలను పారదర్శకంగా సమర్థవంతంగా నిర్వహించామని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. గురువారం వింజమూరులోని తెలుగుదేశం ప్రధాన పార్టీ కార్యాలయంలో ఇరిగేషన్ అధికారులతో కలిసి సాగునీటి సంఘాల ఎన్నికల విజయవంతంపై నియోజకవర్గ సాగునీటి సంఘాల అధ్యక్షులు ఉపాధ్యక్షులు టీసీ నెంబర్లతో ఎమ్మెల్యే ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని నాయకులందరి సహకారంతో సాగునీటి ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించామని తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని సాగునీటి సంఘాలు ఏకగ్రీవమైనట్లు ఎమ్మెల్యే తెలిపారు. రైతులందరూ ఉమ్మడి ప్రభుత్వానికి మద్దతు పలికారున్నారు. రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పట్ల అపూర్వ విశ్వాసం, ప్రగాఢ నమ్మకం చూపిన రైతులందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. ఎన్నికైన సభ్యులందరూ ఐకమత్యంగా వ్యవసాయ పనులకు సాగునీటిని వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. వైసీపీ ప్రభుత్వానికి రైతుల పట్ల చిత్తశుద్ధి లేదన్నారు. సాగునీటి ప్రాజెక్టులను పూర్తిగా నిర్వీర్యం చేసిన ఘనుడు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అన్నారు. కనీసం గేట్లు మరమ్మతులకు కూడా నిధులు మంజూరు చేయలేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో తమ ప్రభుత్వం సాగునీటి రంగానికి అత్యంత ప్రాధాన్య తీస్తుందని చెప్పారు. ఇరిగేషన్ పెండింగ్ పనులను ఒక్కొక్కటిగా పూర్తి చేస్తున్నట్లు చెప్పారు. అదేవిధంగా గత వైసీపీ ప్రభుత్వంలో అక్రమంగా రైతుల వద్ద నుంచి లాక్కున్న భూమిని వెనక్కి తీసుకునేందుకు ప్రత్యేక కార్యచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఒక్క సెంటు భూమిని కూడా వదిలేది లేదన్నారు. రైతన్నలకు ఎల్లవేళలా అండగా ఉంటానని,

-మిగతా 2లో

### పరిశ్రమల ఏర్పాటులో

# జాప్యం లేకుండా అనుమతులు ఇవ్వాలి



### జిల్లా కలెక్టర్ ఆనంద్

**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు జాప్యం లేకుండా అనుమతులను మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. గురువారం ఉదయం కలెక్టరేట్‌లోని శంకరన్‌హాలులో జిల్లా పరిశ్రమలు ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు వచ్చిన దరఖాస్తుల పురోగతి, పిఎంఈజిపి రుణాల మంజూరు, క్లస్టర్ డెవలప్‌మెంటు ప్రోగ్రాం మొదలైన అంశాలను జిల్లా పరిశ్రమల శాఖ జిఎం ప్రసాద్ వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఏర్పాటవుతున్న పరిశ్రమలకు సంబంధించి అన్ని అనుమతులను ఆయాశాఖల అధికారులు సత్వరమే మంజూరు చేయాలన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించి వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్దిష్ట గడువు కంటే ముందుగా అనుమతులు ఇవ్వాలన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు భూసేకరణ ప్రక్రియను వేగవతంగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. గోల్డ్, ప్రింటింగ్, రెడిమేడ్ క్లస్టర్ డెవలప్ ప్రోగ్రాంపై దృష్టిసారించాలన్నారు.

-మిగతా 2లో

# నుడా ప్రతిష్టను పెంచేందుకు అధికారులు సహకరించాలి

- మంత్రి నారాయణ సహకారంతో పెండింగ్ పనులను పూర్తి చేద్దాం
- అక్రమ లేఔట్లపై దృష్టి పెట్టాలి
- ఈ ఆర్థిక సంవత్సరపు లక్ష్యాలను పూర్తి చేసేందుకు అధికారులు సహకరించాలి
- నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి వెల్లడి



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ప్రతిష్ట పెరిగేలా పనిచేసేందుకు అధికారులందరూ సహకరించాలని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి పిలుపునిచ్చారు.. ప్రమాణ స్వీకార మహోత్సవాన్ని అట్టహాసంగా నిర్వహించేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి ఆయన హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలిపారు. వైస్ చైర్మన్ సూర్య తేజ ఆధ్వర్యంలో.. అధికారులతో కోటంరెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు కీలక అంశాలపై చర్చించారు. నుడా పరిధిలో గతంలో చేపట్టిన పనులు పెండింగ్లో ఉన్నాయని.. వాటిని మంత్రి నారాయణ సహకారంతో పూర్తి చేయాలన్నారు. ఆర్థిక సంవత్సర లక్ష్యాలను చేరుకునేందుకు ఉద్యోగులు సహకరించాలని కోరారు. ఎన్టీఆర్ నక్లెస్ రోడ్, పార్కుల అభివృద్ధి వంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు వివరించారు. ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా.. నగర పౌరులందరూ ఐ లవ్ నెల్లూరు అనేలా సింహపురికి కొత్త అందాన్ని తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని కోటంరెడ్డి ధీమా వ్యక్తం చేశారు.. మంత్రి నారాయణ సూచనలు సలహాలతో నుడా పరిధిలోని గ్రామాలను అభివృద్ధి చేస్తానని ఆయన స్పష్టం చేశారు. నుడా ప్రతిష్ట పెంచేలా పనిచేయడమే తన లక్ష్యమన్నారు. అనంతరం నుడా వైస్ చైర్మన్ సూర్యతేజ మాట్లాడుతూ.. కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో నెల్లూరు నగరాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని స్పష్టం చేశారు. కార్పొరేషన్ ప్రజలు కోరుకునే సేవలన్నిటిని వారికి నుడా ద్వారా అందజేస్తామన్నారు.

అక్రమ లేఔట్‌లపై ఇప్పటికే ప్రత్యేక దృష్టి సారించామని.. నిబంధ నలకు విరుద్ధంగా ఉన్న లేవట్లను గుర్తిస్తామని ఆయన వెల్లడించారు. సమావేశంలో నుడా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కవితక్క.. తమ్ముడుగా మీ ఇంటికొచ్చా !

**ఉపాధి భరోసాకు కృషి చేస్తా - అధైర్యపడకు అండగా ఉంటా.. హామీ ఇచ్చిన కాకర్ల తనయుడు సంహిత్**





**జలదంకి, మేజర్ న్యూస్ :** కవితక్క... ఎన్నికల ప్రచారంలో ఉన్న సమయంలో మీ కష్టాన్ని మాకు చెప్పుకున్నావు, మా నాన్న కాకర్ల సురేష్ ఎమ్మెల్యేగా గెలిచి తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత వచ్చి కలిసి మీ కుటుంబ పోషణ భద్రత కల్పిస్తానని హామీ ఇచ్చాను.. అందులో భాగంగానే ఇంటికి వచ్చానని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తనయుడు కాకర్ల సంహిత్ పేర్కొన్నారు. గురువారం జలదంకి మండలం 9వ మైలు కాకుటూరు అరుంధతి వాడలోని పావురాల కవిత నివాసానికి కాకర్ల సంహిత్, ఎన్నికల ప్రచార బృందంతో కలిసి వెళ్లారు. పావురాల కవిత భర్త ఇటీవల చనిపోయారు. ఆమెకి ఒక కుమారుడు ఉన్నాడు. అత్తమామలతో పాటు కుమారుడి కుటుంబ పోషణ కవిత చూడాలి. అందుచేత వారి కష్టం తెలుసుకున్న సంహిత్ ఆమెకు ఉపాధి అవకాశాలు కల్పిస్తానని హామీ ఇచ్చారు. కుటుంబానికి అండగా ఉంటానని భరోసా కల్పించారు. అనంతరం జలదంకి ఎస్సీ కాలనీలో పర్యటించి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఇటీవల శివకుమార్ కాలు విరిగి మంచానికి పరిమితి కాగా, ఆ కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో తమ్మినేని మనో ప్రకాష్, గోచి పాతల విష్ణు కుమార్, పిచ్చిపాటి భార్గవ్ రెడ్డి, ఇమ్రాన్, పిచ్చిపాటి పవన్ కళ్యాణ్, నిమ్మకాయల రామ్, చైతన్య, హరివరం వంశీ, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

# నర్సింగ్ కాలేజీపై చర్యలు తీసుకోండి

## జాయింట్ కలెక్టర్‌కు జనసేన నాయకులు వినతి




**జలదంకి, మేజర్‌న్యూస్ :** విద్యార్థుల నుండి అధిక ఫీజులు వసూలు చేస్తున్న శ్రీసాయి స్కూల్ ఆఫ్ నర్సింగ్ కాలేజీపై చర్యలు తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్‌కి జనసేన నాయకులు వినతి పత్రం అందజేశారు. జలదంకి మండలం జమ్మలపాలెంలో శ్రీ సాయి స్కూల్ ఆఫ్ నర్సింగ్ కాలేజీ వారు విద్యార్థుల నుండి అధిక ఫీజులు చెల్లిస్తేనే ఎగ్జామ్ ఫీజు కట్టించుకుంటామని యాజమాన్యం భయభ్రాంతులకు గురి చేస్తున్నారని విద్యార్థులు వారి సమస్యను జనసేన నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. వారి సమస్యలపై కాలేజీ వద్దకు చేరుకున్న జనసేన నాయకులు కాలేజీ యాజమాన్యాన్ని ప్రశ్నించారు. కాలేజీ యాజమాన్యం దురుసుగా ప్రవర్తించడంతో జనసేన నాయకులు కాలేజీ వద్ద బైఠాయించి నిరసన తెలుపగా, పోలీసులు అక్కడికి చేరుకుని జనసేన నాయకులను సర్ది చెప్పి పంపించారు. శ్రీసాయి స్కూల్ ఆఫ్ నర్సింగ్ కాలేజీపై చర్యలు తీసుకొని విద్యార్థినులకు న్యాయం చేయాలని కోరుతూ గురువారం జిల్లా జాయింట్ కలెక్టర్‌ను కావలి జనసేన పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ సుధీర్, జనసేన నాయకులు కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. జాయింట్ కలెక్టర్ విద్యార్థినులకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చినట్లు జనసేన నాయకులు తెలిపారు. విద్యార్థునుల సమస్యను కావలి జనసేన పార్టీ ఇంచార్జ్ అళహరి సుధాకర్ దృష్టి కూడా తీసుకెళ్లినట్లు జనసేన నాయకులు తెలియజేశారు.

# అన్నదాతలకు అండగా ఉంటా !



(మొదటి పేజీ తరువాయి)

వ్యవసాయాన్ని పండగ చేస్తానన్నారు. ఆడపడుచులకు, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ముందుగా ఏకగ్రీవంగా ఎన్నికైన అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, టీసీ మెంబర్లు ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌ను శాలువాలు పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో 8 మండలాల టీడీపీ మండల కన్వీనర్లు, తెలుగు దేశం, జనసేన, బీజేపీ నాయకులు తదితరులు ఉన్నారు.

# పరిశ్రమల ఏర్పాటులో జాప్యం లేకుండా అనుమతులు ఇవ్వాలి




(మొదటి పేజీ తరువాయి)

ఒక నెలలోగా గోల్డ్ క్లస్టర్ ఏర్పాటుకు సంబంధిత నిర్వాహకులు ముందుకు రావాలని, లేకుంటే రద్దు చేసేందుకు చర్యలు చేపడతామన్నారు. ప్రభుత్వం క్లస్టర్ డెవలప్‌మెంటుకు కోట్లాది రూపాయలు కేటాయించిందని, క్లస్టర్లు మంజూరైన నిర్వాహకులు కూడా ప్రత్యేక శ్రద్ధతో ముందుకొచ్చి ప్రభుత్వానికి సహకారం అందించాలని పిలుపుని చ్చారు. గొప్ప లక్ష్యంతో ప్రభుత్వం క్లస్టర్ డెవలప్‌మెంటు ప్రోగ్రాంను అమలు చేస్తుందని, దీనిని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. చిన్న, మధ్యతరగతి పరిశ్రమలను ప్రోత్సహిం చేందుకు పీఎంఈజీపీ రుణాలను విరివిగా మంజూరు చేయాలని సూచించారు. లీడ్ బ్యాంక్ మేనేజర్, పరిశ్రమలశాఖ జనరల్ మేనేజర్ సమన్వయంతో ఒక మెగా క్యాంపును ఏర్పాటుచేసి రుణాల మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలని, అన్ని పత్రాలు సరిగా వున్న పరిశ్రమల యజమానులకు తక్షణమే రుణాలు మంజూరు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ కార్తీక్, ఎపిఐఐసి జడ్ఎం శేఖర్‌రెడ్డి, డిప్యూటీ జోనల్ మేనేజర్ సురేష్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌రెడ్డి, ఎల్‌డీఎం శ్రీకాంత్ ప్రదీప్, డీఆర్‌డీఏ, డ్వామా పీడీలు నాగరాజకుమారి, గంగాభవాని, ఇరిగేషన్ ఎస్ఈ దేశ్‌నాయక్, డీటీసీ చందర్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ అశోక్ కుమార్, కమిటీ సభ్యులు ఏపీకే రెడ్డి, ఒమ్మిన సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# సురేష్ రెడ్డి నేతృత్వంలో ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** చిరకాల మిత్రుడు సన్నపురెడ్డి సురేష్ రెడ్డి నెల్లూరు ఆర్టీసీ జోనల్ చైర్మన్‌గా నియమితులై స్వల్పకాలంలోనే మా ఊరు సమీప ప్రాంతాలకు ఆర్టీసీ సిటీ సర్వీసును ప్రారంభించడం శుభ పరిణామమని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అన్నారు. జిల్లాలోని ఎమ్మెల్యేలు, మంత్రులందరి సహకారంతో నెల్లూరు ఆర్టీసీని ప్రజలకు అత్యంత చేరవు చేసేందుకు తనవంతు కృషి చేస్తానని చైర్మన్ సన్నపురెడ్డి సురేష్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం నెల్లూరు అయ్యప్ప గుడి నుండి అల్లిపురం నరుకూరు వయా చిన్నచెరుకు ఆర్టీసీ సిటీ సర్వీస్ బస్సును ఆయన ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డిలతో కలిసి ప్రారంభించారు. నెల్లూరు నగరానికి అతి సమీపంలోని పైగ్రామ ప్రజలు చిరకాల వాంఛ నేడు తీరిందని ఆయన సంతోషం వ్యక్తపరిచారు. కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు, డిపో మేనేజర్ మురళిబాబు, వెంకటేశ్వరరావు, శివకేష్ యాదవ్, మురళీకృష్ణ, ధర్మతేజ పాల్గొన్నారు.

అమెరికా టు ఉదయగిరి..

# ఎన్నికల హామీ అమలుకై కాకర్ల సంహిత్

**ఎన్నికల హామీలను అమలు పరచాలని తండ్రికి వినతి**



**కలిగిరి, మేజర్‌న్యూస్ :** ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇచ్చిన హామీలను అమలు పరిచేందుకు అమెరికాలో విద్యాభ్యాసం చేస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తనయుడు కాకర్ల సంహిత్ అమెరికా నుండి వింజమూరు చేరిన వెంటనే తన ఎన్నికల ప్రచార సమయంలో ప్రజలు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను అర్జీ రూపంలో సామాన్య కార్యకర్త వలె తండ్రి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌ని పార్టీ ప్రధాన కార్యాలయంలో కలిసి అందజేశారు. వాటి పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. అనంతరం అర్జీలో పొందుపరిచిన సమస్యల పరిష్కారం దిశగా ఉదయగిరి నియోజకవర్గం కలిగిరి మండలం జు్ౖరావారి పాలెం గ్రామానికి చేరుకున్నారు. ప్రచారంలో పాల్గొన్న యువతతో కలిసి జు్ౖరావారి పాలెం ను సందర్శించారు. గ్రామ నాయకులు పెద్ద వెంకి రెడ్డితో కలిసి వికలాంగుడైన పైడాల మస్తాన్‌రెడ్డి నివాసానికి చేరుకొని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆయనకు వికలాంగు పెన్షన్ వచ్చేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఎన్నికల ప్రచారంలో విన్న సమస్యలను గుర్తుంచుకొని నేడు అమెరికా నుండి రాగానే వాటి పరిష్కారానికై శ్రీకారం చుట్టిన తండ్రి బాటలో నడుస్తున్న యంయల్యే తనయుని చూసి గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు జు్ౖరా పెద్ద వెంకి రెడ్డి, తమ్మినేని మనో ప్రకాష్, ఇమ్రాన్, పిచ్చి పాటి భార్గవ్ రెడ్డి పిచ్చి పాటి పవన్ కళ్యాణ్ తదితరులు ఉన్నారు.

# ఘనంగా పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ 8వ వార్షికోత్సవం




**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ 8వ వార్షికోత్సవ వేడుకలను గురువారం నగరంలోని లోన్ స్టార్ట్ చర్చ్‌లో ఘనంగా జరిగాయి. వార్షికోత్సవ సందర్భంగా 60 సంవత్సరాల పైబడి 25 సంవత్సరాలు సేవా అనుభవం ఉన్న పాస్టర్లను ఈ సందర్భంగా సన్మానించారు. ముఖ్యఅతిథిగా రూరల్ తహసిల్దార్ లాజరు మాట్లాడుతూ.. పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ 8సంవత్సరాలుగా సేవకులకు ఎన్నో సేవలు అందిస్తున్నారని ఇకముందు కూడా మరెన్నో సేవలు అందించాలని, సీనియర్ పాస్టర్లను ఈ రీతిగా సన్మానించడం అభినందించ తగ్గ విషయం అని అన్నారు. పిడబ్ల్యూఎ రాష్ట్ర కార్యదర్శి, లోన్ స్టార్ చర్చ్ సంఘ కాపరి పాస్టర్ ఐఎస్ బెన్హర్ బాబు వాక్య సందేశం చేశారు. అనంతరం ఒకే కట్ చేసి సీనియర్ పాస్టర్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌పిఎఫ్ ప్రధాన కార్యదర్శి రెవరెండ్ బి.డేవిడ్ దయా సాగర్, అబైడింగ్ హెూప్ చర్చ్ పాస్టర్ టైటస్ నిర్మల్ కుమార్, వ్యవస్థాపక అధ్యక్షులు గడ్డం హనొక్, నేషనల్ కన్వీనర్ జయ ప్రకాష్, నెల్లూరు జిల్లా అధ్యక్షులు రమేష్, ఉపాధ్యక్షులు కెఎస్ రాజు, వై.సదాశివరావు, ప్రధాన కార్యదర్శి, జాషువా. కోశాధికారిఎస్ ఎనోష్, కార్యదర్శి జె కిషోర్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరి ఎన్.సునీల్ గవాస్కర్, సహాయ కార్యదర్శులు, ఎం.శ్యామ్ ప్రసాద్, సుధీర్ బాబు, ఆత్మామీనన్, కార్యవర్గ సభ్యులు, శశి, సునీల్ కుమార్, మనుబోలు మండల అధ్యక్షులు స్వామీజీ, ఏపీపీఎఫ్ నెల్లూరు జిల్లా అధ్యక్షులు రాజశేఖర్ దాసరి, రూరల్ పాస్టర్స్ ఫెలోషిప్ నాయకులు క్రాంతి కుమార్, నెల్లూరు పాస్టర్స్ అసెంబ్లి ప్రధాన కార్యదర్శి రాఘవ మోసెస్, యేసుతో ఉదయకాల పరిచర్య సేవకులు ప్రభు కుమార్, పాల్, విశ్రాంత ఉపాధ్యాయులు రాయ్ జసన్ తదితర పాస్టర్స్ సన్మాన గ్రహీతలు తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు సీఆర్సీలో అందిస్తున్న సేవలు అద్భుతం




**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** వెంకటాచలం మండలంలోని ఎర్రగుంట వద్ద సీఆర్సీ సెంటరులో దివ్యాంగుల క్రీడాపోటీలను ప్రారంభించిన సందర్భంగా సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పేర్కొన్నారు. సీఆర్సీలో దివ్యాంగులకు అందిస్తున్న అన్ని సేవలపై ఆరా తీసిన సోమిరెడ్డి, జాతీయ స్థాయి ప్రమాణాలతో సేవలందించే సీఆర్సీ సర్వేపల్లి నియోజకవర్గంలో ఉండటం సంతోషంగా ఉందన్నారు. ఫిజికల్ మెడిసిన్ అండ్ రిహాబిలిటేషన్, క్లినికల్ సైకాలజీ, స్పీచ్ అండ్ ఆడియోలాజికల్ సేవలు, ప్రత్యేక విద్య, ఫిజియోథెరపీ, హైడ్రో థెరపి, ఆక్యుపెషనల్ థెరపీ, నైపుణ్యాభి వృద్ధి శిక్షణ తదితర అనేక సేవలు ఉచితంగా అందించడం శుభపరిణామం, ఈ సేవల వివరాలన్నింటిని గ్రామస్థాయిలోకి తీసుకెళ్లి అవసరమైన వారు సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించే బాధ్యత అందరిపై ఉంది. పెద్దాయన ముప్పవరపు వెంకయ్య నాయుడు ప్రత్యేక శ్రద్ధతో అనేక జాతీయ స్థాయి సంస్థలు మన సర్వేపల్లి నియోజకవర్గంలో ఏర్పాటయ్యాయి. సీఆర్సీకి నా వైపు ఎలాంటి సహకారం అవసరమైనా అందించేందుకు ఎప్పుడూ సిద్ధంగా ఉన్నాను.

## పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు అండగా ఉంటా : ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్



**కలిగిరి, మేజర్‌న్యూస్ :** మండల పరిధిలోని దూబగుంటలో ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, తనయుడు కాకర్ల సంహిత్‌తో కలసి పర్యటించారు. ముందుగా దూబగుంట గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కి, వారి కుమారుడు కాకర్ల సంహిత్‌కి గ్రామ టిడిపి నాయకులు, గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం టిడిపి కార్యకర్త అయినటువంటి పిచ్చపాటి పవన్ కళ్యాణ్ ఇంటికి వెళ్లిన ఎమ్మెల్యే కాకర్ల సురేష్ వారి కుటుంబ సభ్యులను ఆప్యాయంగా పలకరించారు. తదనంతరం ఎమ్మెల్యేని, వారి కుమారుడు కాకర్ల సంహిత్‌ని గ్రామ టిడిపి నాయకులు సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నా గెలుపు కోసం కృషి చేసిన ప్రతి ఒక్క కార్యకర్తకు అండగా ఉంటానని, అలాంటి కార్యకర్తల బలోపేతానికి నా వంతు సహకారం అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు, గ్రామ నాయకులు, కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ సమైక్యత శిబిరంలో వీఎస్‌యూ విద్యార్థులు




**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** జాతీయ సమైక్యత శిబిరాన్ని మధ్యప్రదేశ్ రాష్ట్రంలో గ్వాలియర్ జిల్లాలో లక్ష్మీబాయి నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ యూనివర్సిటీలో ఈనెల 21 నుంచి 27 వరకు నిర్వహించనున్నారు. ఈ జాతీయ సమైక్యత శిబిరానికి విక్రమ సింహపురి యూనివర్సిటీ కళాశాల, అనుబంధ కళాశాల విద్యార్థులు 8 మంది సెలెక్ట్ అవ్వడం జరిగింది. వీరితోపాటుగా విడవలూరు జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ సునీల్‌శర్మ కంటెన్జెంట్ లీడర్‌గా ఎంపికయ్యారు. ఈ జాతీయ సమైక్యత శిబిరంలో విద్యార్థులు పాల్గొని వివిధ ప్రతిభాపాటవాళ్లను ప్రదర్శించడంతో పాటుగా వ్యక్తిత్వ వికాస అంశాల పైన తర్ఫీదు పొందనున్నారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఎస్.విజయభాస్కర్ రావు విద్యార్థులను అభినందిస్తూ ఈ శిబిరంలో 8 మంది విద్యార్థులు పాల్గొనడం గొప్ప విషయం అని ఎన్ఎస్ఎస్ ద్వారా యూనివర్సిటీ గుర్తింపు ను జాతీయస్థాయిలో విద్యార్థులు తమ ప్రతిభ ద్వారా ప్రదర్శించబోతున్నందుకు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్‌కు కావలసిన ఏర్పాట్లను ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఉదయ్ శంకర్ అల్లం, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ బి.వెంకటసుబ్బారెడ్డి దగ్గరుండి పర్యవేక్షించి వారిని ఆ శిబిరానికి సాగనంపడం జరిగింది.

# ఘనంగా గోపాలకృష్ణయ్య స్కూల్‌లో గణిత దినోత్సవం

**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :** బుచ్చిరెడ్డిపాలెం పట్టణంలోని శ్రీ గోపాలకృష్ణయ్య పాఠశాలలో జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో గణితం ప్రయోగశాలను విశ్వం ఎడ్యుకేషనల్ సొల్యూషన్స్ వారి జోనల్ మేనేజర్ వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఈ ప్రదర్శనలో గణిత శాస్త్రానికి సంబంధించిన 500 ప్రయోగాలను ఏర్పాటు చేశారు. విద్యార్థులు తయారు చేసిన ప్రయోగాలను ప్రదర్శనలో ఉంచారు. గణిత శాస్త్ర పితామహుడు ఆర్యభట్ట గురించి విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ నేలనూతల శ్రీధర్ మాట్లాడుతూ.. విద్యార్థులకు గణిత శాస్త్రం పట్ల ఉన్న భయాన్ని అపోహలను తొలగించేందుకు ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలని సూచించారు. గణిత శాస్త్రం పట్ల విద్యార్థులు అవగాహన పెంచుకొని అలావోకగా గణిత శాస్త్రాన్ని అభ్యసించాలని తెలిపారు. గణిత శాస్త్రం గురించి పూర్తిగా అవగాహన చేసుకునేందుకు ఈ ప్రదర్శన ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. ఈ ప్రదర్శన రెండు రోజులుపాటు ఉంటుందని తల్లిదండ్రులు, పుర ప్రముఖులు విచ్చేసి గణిత ప్రయోగశాలను సందర్శించవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సురేఖ విద్యార్థులు తల్లిదండ్రులు అందరూ పాల్గొన్నారు.



# వీఎస్‌యూలో స్టూడెంట్స్ హ్యాండ్ బుక్ ఆవిష్కరణ

**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని, విశ్వవిద్యాలయ విద్యార్థులకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని కలగలిపిన పుస్తకాన్ని విశ్వవిద్యాలయ చరిత్రలోనే మొట్టమొదటి సారిగా విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఎస్.విజయభాస్కర రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉపకులపతి మాట్లాడుతూ.. ఈ పుస్తకం విద్యార్థులకి మంచి మార్గదర్శకంగా ఉంటుంది. విశ్వవిద్యాలయంలో అందుబాటులో ఉన్న అన్ని విద్యా కార్యక్రమాలు, వనరులు, సదుపాయాలు, అవకాశాలను ఒకే చోట పొందుపరచడం ద్వారా విద్యార్థులు తమ విద్యా ప్రమాణాన్ని మరింత విజయవంతంగా ఆవిష్కరించగలరు. ఇది నూతన తరం విద్యార్థులకి ప్రేరణగా నిలుస్తుందని పేర్కొన్నారు. అలాగే ఆయన ఈ పుస్తకం రూపకల్పనలో



భాగమైన టీమ్‌ను అభినందించి, భవిష్యత్తులో మరింత ఉపయోగకరమైన సమాచార సదుపాయాలను అందించేందుకు విశ్వవిద్యాలయం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సిహెచ్.విజయ, పరీక్షల నియంత్రణ అధికారి ఆర్.మధుమతి, ఉదయ శంకర్, కోటనీల మణికంఠ, డాక్టర్ పి.గోపి కృష్ణ, డాక్టర్ పి.శ్రీనివాస్, డాక్టర్ పి.త్రివేణి, కేవీఎల్ కన్య రావు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎయిడ్స్ పై అవగాహన అవసరం




**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లా లెప్రసీ ఎయిడ్స్ టీబీ అధికారి డాక్టర్ ఎస్‌కే ఖాదర్ వలీ నియంత్రణ కార్యక్రమంలో భాగంగా పొదలకూరు రోడ్‌లోని నవజీవన్ ఆర్గనైజేషన్‌లో ప్రోగ్రామాటిక్ పాపులేషన్ అండ్ సైజ్ ఎస్టిమేషన్ జిల్లా లెవెల్‌లో జరిగే శిక్షణా కార్యక్రమానికి గురువారం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమంలో పనిచేసే ప్రతి ఒక్క ఎన్జీవో కూడా క్షేత్ర స్థాయిలో విస్తృతంగా పర్యటిస్తూ ఎయిడ్స్ వ్యాధి గురించి ప్రజలలో అవగాహన కార్యక్రమాలు చేయాలని, ఎవరైతే ఎయిడ్స్ వ్యాధితో బాధపడుతున్నారో వారందరికీ మనోధైర్యాన్ని కల్పించి వారందరికి మందులు ఉచితంగా అందుబాటులో ఉన్నాయని తెలియజేశారు. అంతేకాకుండా హెచ్ఐవి ఎయిడ్స్ సోకిన రోగులు, షుగర్ వ్యాధి ఉన్నవారు, ఎవరైతే రెండు వారాల మించి దగ్గు, జ్వరం, ఆకలి లేకపోవడం వంటి లక్షణాలతో బాధపడుతున్నారు. వారందరూ తప్పనిసరిగా కఫం పరీక్షలు దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో చేపించుకోవాలని సూచించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో ఎయిడ్స్ వ్యాధి గురించి సలహాలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీపీపీసీయూ సంబంధించి శివ, టీబీ నివారణ సిబ్బంది, జిల్లాలో ఎయిడ్స్ నివారణ కార్యక్రమంలో ఉన్న వివిధ రకాల ఎన్జీవోలు పాల్గొన్నారు.

# ఆత్మకూరుకు నామినేటెడ్ పదవుల యోగం ఎన్నిటికో..

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు నియోజకవర్గంలో టిడిపి, బిజెపి, జనసేన నాయులకు నామినేటెడ్ పదవుల యోగం ఎన్నిటికో అని పలువురు చర్చించుకుంటు న్నారు. ప్రభుత్వం త్వరలో నామినేటెడ్ పోస్టులకు ఆపార్టీకోసం శ్రమించిన వారిని నియమిస్తారని చెబుతుండడంతో ఆత్మకూరు నియోజకవర్గంలో ఆశావహులు అధికంగానే కన్పిస్తున్నారు. గతంలో నామినేటెడ్ పోస్టులు భర్తీఅవుతాయని అందరూ భావిస్తుండేవారు. విజయవాడలో వరదలు రావడంతో వాయిదాపడ్డాయని చెబుతుండేవారు. ఎప్పుడెప్పుడు విజయవాడలో సాధారణపరిస్థితి ఏర్పడుతుందా, నామినేటెడ్ పోస్టులు దక్కుతాయా అని నాయకులు ఆతృతగా ఎదురుచూస్తుండేవారు. ఇటీవల కొన్ని నామినేటెడ్ పదవులు భర్తీకాగా ఆత్మకూరు ప్రాంతానికి ఏమీ రాలేదు. కాగా ఇటీవల ఆత్మకూరు శాసనసభ్యులు, రాష్ట్ర దేవాదాయశాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలుగుదేశం సభ్యత్వకార్యక్రమ సమీక్ష సందర్భంగా త్వరలో నిమినేటెడ్ పోస్టులు భర్తీకానున్నాయని పేర్కొన్నారు. దాంతో ఆశావహుల్లో మరింతగా ఆతృత మొదలైంది. రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి వివిద నామినేటెడ్ పోస్టులను కూటమిలోని తెలుగుదేశంకు 60శాతం, జనసేనకు 30శాతం, బిజెపికి 10శాతం ఇచ్చేలా ఇప్పటికే నిర్ణయించిన విషయం తెల్సిందే. ఆత్మకూరులో మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్యానాయుడు ఇటీవల ఎన్నికల్లో తెలుగుదేశం అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి విజయానికి కృషిచేశారు. ఆయన ఎమ్మెల్సీ పదవిపై ఆశలుపెట్టుకున్నారని తెలుస్తోంది. మరో మాజీ ఎమ్మెల్యే బొల్లినేని కృష్ణయ్యనాయుడు మేనల్లుడు, నెల్లూరు కిమ్స్‌హాస్పిటల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తాళ్ళూరు గిరినాయుడు అన్నివిదాల ఆనం విజయం కోసం అహర్నిశలు తీవ్రంగా శ్రమించారు. ఆయనకు రాష్ట్రస్థాయి చైర్మన్ పదవి లభించగలదని పలువురు చర్చించుకుంటున్నారు. ఇక జిల్లాకేంద్రసహకార బ్యాంకు మాజీ చైర్మన్ మెటుకూరు ధనుంజయరెడ్డి ఎమ్మెల్యేగా పోటీచేయాలని భావించి వీలుకానందున విరమించుకొని ఆయనకు అభిమాననేత ఆనం విజయం కోసం తీవ్రంగా కృషిచేశారు. ఆయనకు కూడా రాష్ట్రస్థాయి కార్పోరేషన్ చైర్మన్ పదవి దక్కగలదని భావిస్తున్నారు. నియోజకవర్గ స్థాయిలో తెలుగుదేశంనేతగా ఉన్న మాజీ మండలాధ్యక్షుడు పుట్టం బ్రహ్మానందరెడ్డి కూడా నామినేటెడ్ పదవి ఆశావహుల జాబితాలో ఉన్నారని తెలుస్తోంది. అనాదిగా పార్టీలో ఉంటూ వివిద నియోజకవర్గాలకు పరిశీలకులుగా వ్యవహరించిన రాష్ట్ర తెలుగుదేశం కార్యదర్శి దావా పెంచలరావు, అనాదిగా పార్టీకోసం తీవ్రంగా శ్రమిస్తున్న రాష్ట్ర తెలుగుమహిళ కార్యదర్శి పులిమి శైలజారెడ్డి కూడా ఆశావహుల జాబితాలో ఉన్నారని తెలుస్తోంది. ఇక మండలాల స్థాయిలో పార్టీలో వివిద స్థాయిల్లో ఉన్న నేతలు కూడా అత్యధికంగానే నామినేటెడ్ పోస్టులు ఆశిస్తున్నారని తెలుస్తోంది. దీర్ఘకాలిక ప్రధాన ప్రజాసమస్యలపై పోరాటాలు సాగిస్తూ నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్‌గా వ్యవహరించిన నలిశెట్టి శ్రీధర్ కూడా ఓమోస్తర్ నామినేటెడ్ పోస్టు పొందగలరని భావిస్తున్నారు. బిజెపిలో సీనియర్లు కుడుముల సుధాకర్‌రెడ్డి, కరటంపాటి సుధాకర్‌లు కూడా ఆశావహుల జాబితాలో ఉన్నారని తెలుస్తోంది. ఇప్పటికే పార్టీ అధిష్టానం పార్టీకోసం కృషిచేసిన సీనియర్ల జాబితాలు సేకరించిందని, పోస్టులకు ఎంపికలో ప్రాధాన్యతాక్రమం ఉంటుందని భావిస్తున్నారు. కొందరు నేతలు తమ బయోడేటాలను అధిష్టానానికి అందించారని కూడా తెలుస్తోంది. ఆత్మకూరు మున్సిపాలిటీ, ఆత్మకూరు, అనంతసాగరం, ఏఎస్‌పేట, సంగం, చేజర్ల, మర్రిపాడు మండలాల్లో దాదాపు 100 మంది నామినేటెడ్ చిన్నా,పెద్దా పదవులకోసం ఆశపడుతున్నారని పలువురు చర్చించుకుంటున్నారు. పట్టణ, మండల టిడిపి అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కూడా ఆశావహుల జాబితాలో ఉన్నారని తెలుస్తోంది.

## పోలీస్‌స్టేషన్‌లో యోగా కార్యక్రమం



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు పోలీస్‌స్టేషన్‌లో సీఐ జి.గంగాధర్ ఆధ్వర్యంలో గురువారం యోగ కార్యక్రమం నిర్వహించారు. తమ సిబ్బంది, సమీప పాఠశాల విద్యార్థులతో ఆయన అనేక యోగ విన్యాసాలు చేయించారు. యోగ వలన అత్యంత ప్రయోజనకరమని, ఆరోగ్యం, క్రమశిక్షణ, ఏకాగ్రత, మానశిక ప్రశాంతత తదితరాలు లభిస్తాయని సిఐ గంగాధర్ పేర్కొన్నారు. అందరూ యోగ అలవరుచుకోవాలని గంగాధర్ కోరారు. ఈకార్యక్రమంలో ఎస్ఐలు జిలానీ, సాయిప్రసాద్, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య సమరయోధుల వర్ధంతి వేడుకలు



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** స్థానిక రేడియన్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఆవాజ్ మండల కమిటీ ఆధ్వర్యంలో దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడి ప్రాణాలర్పించిన అష్ఫాఖుల్లాఖాన్, పండిత్ రాంప్రసాద్బిస్మిల్ 97వ వర్ధంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. దేశానికి వారు చేసిన సేవలను వివరిస్తూ ప్రతిఒక్కరు స్ఫూర్తిగా తీసుకొని నడుచుకోవాలన్నారు. అనంతరం వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మసూద్, ఆవాజ్ కమిటీ సభ్యులు నజర్‌షా, హీనా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మహిమలూరులో సీసీ రోడ్డు పనులకు శ్రీకారం



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మండలం మహిమలూరులో గురువారం సిమెంటురోడ్డు పనులకు మండల తెలుగుదేశం నాయకుడు వల్లూరు వెంకట రమణారెడ్డి, జిల్లా తెలుగురైతు కార్యదర్శి మద్దినేని నారాయణ ప్రారంభించారు. మహాత్మాగాంధీ జాతీయగ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా నిర్మించనున్న సిమెంటురోడ్డు పనులను ప్రారంభించారు. సకాలంలో నాణ్యతా ప్రమాణాలతో ఈరోడ్డు నిర్మాణం జరుపుతా మని వల్లూరు వెంకట రమణారెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఎస్ఐ జమాల్ వల్లికి పుట్టినరోజు శుభాకాంక్షలు



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి ఒకటో పట్టణంలో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న జమాల్‌వల్లి పుట్టిన రోజు సందర్భంగా గురువారం కావలి ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌కి వెళ్లి దుశ్శాలువాతో సత్కరించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం హ్యాపీ సేవా సంస్థ గౌరవాధ్యక్షులు షేక్.ఖాదరబాషా మాట్లాడుతూ.. మంచి సేవా తత్పరులు జమాల్ వల్లి అని, హ్యాపీ సేవా సంస్థ ద్వారా ప్రతి సంవత్సరం వారి సతీమణి పేరుమీద నిరుపేదలకు దుస్తులు పంపిణీ చేయడం ఎంతో సంతోషం అభినందనీయమని తెలిపారు. ఆయన చేస్తున్న సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో హ్యాపీ సేవా సంస్థ అధ్యక్షులు లోకదాలత్ సభ్యులు మాలకొండ రెడ్డి, దేవరకొండ విజయ్, జాగర్లపూడి సాయి శివ, తదితరులు ఉన్నారు.

# సుస్థిర అభివృద్దే ప్రభుత్వ లక్ష్యం : స్టేట్ అబ్జర్వర్ ప్రసాద్



**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** గ్రామ పంచాయతీలు సుస్థిర అభివృద్దే ప్రభుత్వ లక్ష్యమని ఎన్ఐఆర్డీ స్టేట్ అబ్జర్వర్ ప్రసాద్ పేర్కొన్నారు. ఏఎస్పేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో రెండవ రోజు గురువారం గ్రామ పంచాయతీ సర్పంచులు, మండల స్థాయి అధికారులు, పంచాయతి కార్యదర్శులు సచివాలయ సిబ్బందికి జరుగుతున్న శిక్షణా శిబిరానికి ఎన్ఐఆర్డీ స్టేట్ అబ్జర్వర్ ప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు ఈ సందర్భంగా సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించుటకు గ్రామ పంచాయతి సర్పంచులు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు సచివాలయ సిబ్బంది కృషి చేయాలని ఎన్ఐఆర్డీ స్టేట్ అబ్జర్వర్ ప్రసాద్ సూచించారు అలాగే సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించడానికి స్థానిక ప్రభుత్వాలు, ఉద్యోగులు కలసి పనిచేసి పేదరికం లేని సమాజము నిర్మాణంకు దోహదపడాలని ఎంపీడీవో ప్రసన్నకుమారి కోరారు గ్రామ పంచాయతీల నందు త్రాగునీరు కల్పనపై జల జీవన్ మిషన్ జిల్లా కోఆర్డినేటర్ చంద్రశేఖర్ శర్మ సర్పంచులకు సచివాలయ సిబ్బందికి తాగునీటి ఆవశ్యకతపై వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో విస్తరణాధికారి రమేష్ ఏపీఎం, వెలుగు సతీష్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈఈ రవితేజ ఎంపిహెచ్ఈఓ షేక్ షఫి ముఖ్య వక్తలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని సర్పంచులు, పంచాయతి కార్యదర్శులు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# నయా పద్ధతులతో సైబర్ నేరగాళ్లు.. జాగ్రత్తలు తప్పనిసరి




- నెల్లూరు సెట్నల్ సీఈఓ బి.శ్రీనివాసరావు
- సైబర్ నేరం.. అవగాహనతోనే దూరం.. నినాదంతో ట్రీస్ ఆధ్వర్యంలో జిల్లాలో విస్తృతంగా అవగాహన సదస్సులు

**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** సైబర్ నేరగాళ్లు కొత్తపద్ధతులతో ప్రజలను మోసగిస్తున్నారని, ఫోన్‌లో హలో.. అంటూ అంతలోనే దోచేస్తున్నారని నెల్లూరు సెట్నల్ సీఈఓ బీ.శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ ఎండీ గయాజ్ అన్నారు. గురువారం నెల్లూరు నగరంలోని నవలాకులతోట (4వ మైలు)లో పొదలకూరు ట్రీస్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత, పొదుపు, సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సెట్నల్ అధికారు శ్రీనివాస రావు, గయాజ్ మాట్లాడుతూ.. సైబర్ నేరం.. అవగాహనతోనే దూరం.. నినాదంతో జిల్లాలో ట్రీస్ స్వచ్ఛంద సేవా సంస్థ విస్తృతంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తోందన్నారు. మోసాలకు గురైతే సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నంబర్ 1930కు దయల్ చేయవచ్చునన్నారు. cybercrime.gov.inకు ఫిర్యాదు చేయొచ్చని పిలుపునిచ్చారు. స్వయంకృషి (ఎన్‌జీఓ), ట్రీస్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు శ్రీలత, షేక్.నౌరాజ్ మాట్లాడుతూ.. అప్పుల విషయంలో జాగ్రత్తగా వుండాలని, గుర్తింపు పొందిన సంస్థలలో మాత్రమే అప్పులు తీసుకోవాలని సూచించారు. గతంలో లోన్ యాప్‌ల బారిన పడి అధిక వడ్డీలు కట్టలేక, బ్లాక్ మెయిలింగ్ తట్టుకోలేక అనేకమంది ఆత్మహత్యలకు పాల్పడిన సంగతి గుర్తుచేశారు. ఆర్బీఐ వారి సౌజన్యంతో పొదలకూరుకి చెందిన ట్రీస్ స్వచ్ఛంద సేవా సంస్థ వారు బ్యాంక్ సేవలు, ఆర్థిక మోసాలపై అవగాహన కల్పిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమలో భాగంగా పలు రకాల బ్యాంకు పథకాలు, సేవలపై సంపూర్ణ అవగాహన కల్పిస్తూ ప్రదర్శించిన పోస్టర్లు చూపరులను ఆకొట్టుకున్నాయి. ఆర్బీఐ మేనేజర్ (హైదరాబాదు) పరిశీలకులు సాహు మాట్లాడుతూ.. పొదుపు అవసరం, సైబర్ నేరాలపై బ్యాంక్ ప్రతినిధులమంటూ అపరిచితుల నుంచి వచ్చే మేసేజ్‌లు, ఫోన్ కాల్స్‌కు స్పందించవద్దన్నారు. ఫోన్‌కు వచ్చే ఓటీపీ, డెబిట్ కార్డుల పిన్, సీవీవీ వంటి నంబర్లు ఇతరులకు చెప్పవద్దన్నారు. అలాంటి గోప్యతా వివరాలను బ్యాంకులు అడగవని గుర్తించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఖాతాదారులకు అందిస్తున్న ప్రత్యేక పథకాలు, సేవలను ఖాతాదారులకు వివరించారు. వ్యక్తిగత ఆర్థిక ప్రణాళికలను ఎలా తయారు చేసుకోవాలో వివరించారు. నగదు రహిత లావాదేవీలు నిర్వహించడానికి ప్రాముఖ్యత ఇవ్వాలని సూచించారు. ఫిర్యాదుల వ్యవస్థను ఉపయోగించుకొని సత్వర సక్రమ ఆర్థిక సేవలను పొందాలన్నారు. బ్యాంకింగ్ అంబుడ్స్ మెన్‌ను ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రీస్ కార్యదర్శి షేక్.అహ్మద్, రిసోర్స్ పర్సన్స్ టి.వెంకటేశ్వర్లు, ఎ.చంద్రశేఖర్, బ్యాంకు ఖాతాదారులు, స్థానికులు పాల్గొన్నారు.

# చెట్ల పెంచండి - పర్యావరణాన్ని పరిక్షించండి

- వాతావరణ కాలుష్యాన్ని నిరోధించే శక్తి చెట్లకు మాత్రమే వుంది
- చెట్లు నాటే సిబ్బందికి మున్సిపల్ ఛైర్ పర్సన్ మోర్ల సుప్రజ దిశా నిర్దేశం



**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :** బుచ్చిరెడ్డి పాళెం నగర పంచాయతీ పరిధిలో చెట్లు నాటి పచ్చదనం పెంచాలని మున్సిపల్ ఛైర్ పర్సన్ మోర్ల సుప్రజ గారు సిబ్బందిని ఆదేశించారు. బుచ్చి నగర పంచాయతి కార్యాలయంలో ఆమె చెట్లు నాటే సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఛైర్ పర్సన్ మోర్ల సుప్రజ మాట్లాడుతూ.. పర్యావరణ సమతుల్యత కాపాడే చెట్ల పెంపకంలో ప్రజలను భాగస్వాముల్ని చేయాలని సిబ్బందిని కోరారు. వాతావరణ కాలుష్యాన్ని అరికట్టడంలో చెట్ల పాత్ర గురించి సిబ్బందికి వివరించారు. బుచ్చి పట్టణ పరిధిలో చెట్లు నాటడమే కాకుండా వాటికి ట్రీ గార్డులు ఏర్పాటు చేయాలని పరిరక్షించాలని సిబ్బందిని ఆదేశించారు. పచ్చదనం పెంచడంలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు.

## కావలిలో కలవరం పుట్టిస్తున్న వైరల్ జ్వరాలు

### ప్రజలు జర జాగ్రత్త... డాక్టర్ ఉమాచంద్



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణం, నియోజకవర్గంలోనే కాకుండా నెల్లూరు జిల్లాలో రోజురోజుకీ వాతావరణంలో వచ్చిన మార్పుల వలన సీజనల్ వ్యాధులు వస్తున్నాయని ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఫిజీషియన్ డాక్టర్ ఉమాచంద్ తెలిపారు. కావలి 'సూర్య' ప్రతినిధితో మాట్లాడుతూ.. కావలి పట్టణ ప్రజలు నియోజకవర్గ ప్రజలు జాగ్రత్తలు పాటించాలని ప్రతి ఒక్కరు కాచి చల్లార్చిన నీరు తాగాలని అలాగే, జనసంచారం ఎక్కువగా ఉన్న దగ్గర ప్రజలు ఉండకూడదని, అలాగే మాస్కు ధరించాలని, దోమలు రాకుండా ఇంటి పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచుకొని జాగ్రత్తలు పాటించాలని, జ్వరాలు వచ్చిన వెంటనే డాక్టర్‌తో సంప్రదించి వారి సలహాలు తీసుకొని మందులు వాడాలని, అలాగే నెల్లూరు జిల్లాలో సంచలనం సృష్టించిన 'జికా' వైరస్, ఈ వైరస్ వలన ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని, ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో అన్ని వ్యాధులకు మందులు ఉన్నాయని ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని ప్రజలు, వారి కుటుంబ సభ్యులు ఆనందంగా ఆరోగ్యంగా ఉండడానికి తగు జాగ్రత్తలు తీసుకోవాలని జ్వరం వచ్చిన వెంటనే డాక్టర్‌ను సంప్రదించి డాక్టర్ సలహా తీసుకొని మందులు వాడాలని తెలిపారు.

## క్రిస్మస్ స్టార్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే కావ్య



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలో స్థానిక క్రిస్టియన్ పేటలో ఫ్రీ క్రిస్మస్ సందర్భంగా క్రిస్టియన్ పేట కోపరేటివ్ కాలనీ క్రైస్తవులు ఏర్పాటు చేసిన క్రిస్మస్ స్టార్‌ను ప్రారంభించేందుకు ముఖ్యఅతిథిగా కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి హాజరయ్యారు. అనంతరం అక్కడికి విచ్చేసిన పాస్టర్ మాట్లాడుతూ.. క్రీస్తు పుట్టుక గురించి వివరించారు. అనంతరం ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి అక్కడ ఏర్పాటు చేసిన క్రిస్మస్ కేకును చిన్న పిల్లలతో కలిసి కట్ చేసి తినిపించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. క్రిస్టియన్ పేటలోని నా ప్రస్థానం మొదలయ్యి ఎమ్మెల్యే స్థాయికి ఎదిగి ఇప్పుడు క్రిస్టియన్ పేటలో ఎమ్మెల్యేగా నేను స్టార్స్‌ను ఈ విధంగా ఆవిష్కరించడం నాకు ఎంతో సంతోషంగా ఉందని, అలాగే క్రీస్తు పుట్టుక దినమున సుమారు 200 దేశాల్లో ఘనంగా నిర్వహిస్తారని, అలాగే క్రీస్తు ప్రేమ కలిగినవారని హృదయంలో ఏ కల్మషం లేకుండా పరిశుద్ధంగా జీవించాలని, క్రీస్తు మార్గంలోనే ప్రజలు నడవాలని ఆయన అన్నారు.అలాగే కావలి పట్టణ ప్రజలకు నియోజకవర్గ ప్రజలకు అడ్వాన్స్ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కావలి పట్టణ ప్రజలు నియోజకవర్గ ప్రజలు సుఖశాంతులతో క్రిస్మస్ పండగను సుఖ సంతోషాలతో జరుపుకోవాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్రిస్టియన్ యూత్, పాస్టర్లు పాల్గొన్నారు. అనంత్రం క్రిస్టియన్ పేట ఏడు లైన్లలో కట్టిన ఏడు స్టార్‌లను ఎమ్మెల్యే కావ్య ఆవిష్కరించారు.

## కేజీబీవీ పాఠశాల తనిఖీ : డీఈఓ బాలాజీ రావ్

కేలిగిరి, మేజర్‌న్యూస్ : మండల కేంద్రంలో ఉన్న కేజీబీవీ బాలికల పాఠశాలను జిల్లా విద్యాశాఖ అధికారి బాలాజీ రావ్ గురువారం అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని పలు రికార్డులను, అలాగే విద్యార్థులకు అందించే భోజనం, విద్యాభ్యాసం గురించి అడిగి తెలుసుకున్నారు.





# స్వచ్ఛందంగా అందరూ టీడీపీ సభ్యత్వం స్వీకరించండి

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** తెలుగుదేశం ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అందరూ గమనించి స్వచ్ఛందంగా టీడీపీ సభ్యత్వం స్వీకరించాలని తెలుగుదేశం యువనాయకుడు, 4వవార్డు ఇన్‌చార్జ్ దాసరి మధుసూధనరావు కోరారు. ఆయన గత తమ వార్డుపరిధిలో ముమ్మరంగా సభ్యత్వ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉత్తర్వులు, రాష్ట్ర దేవాదాయశాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదేశాలతో సభ్యత్వ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. శుక్రవారం ఆయన ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ.. తెలుగుదేశం ప్రభుత్వం అధికారం చేపట్టిన స్వల్పకాలంలోనే పెన్షన్లపెంపు, మెగా డిఎస్‌సి విడుదల, ఉచిత గ్యాస్‌పథకం ప్రారంభం, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడిరుణాల ప్రకటన, ప్రాజెక్టుల నిర్మాణాలు ప్రారంభం, రోడ్ల మరమ్మత్తులు, సిమెంటురోడ్ల మంజూరు తదితర అనేకానేక కార్యక్రమాలు అమలుచేస్తున్నారని, ప్రజలు అన్నింటిని గమనించాలని, మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆత్మకూరు సర్వతోముఖాభివృద్ధికి అనేక ప్రణాళికలు రూపొందించి అమలుచేస్తున్నారని, ఇప్పటికే అనేక అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించారని అన్నిటినీ



గుర్తించాలని ఆయన కోరారు. అన్నివర్గాల వారు విరివిగా తెలుగుదేశం సభ్యత్వం స్వీకరించాలని, తద్వారా 5లక్షల రూపాయల భీమా ఉచితంగా పొందాలని మధుసూధనరావు కోరారు. ఈకార్యక్రమంలో బిఎల్‌ఏ మునగల వెంకటరమణ, వార్డునాయకుడు దాసరి బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ సభ్యత్వం బహుళప్రయోజనకరం : తుమ్మల



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** తెలుగుదేశం పార్టీసభ్యత్వం స్వీకరించేవారికి బహుళప్రయోజనకరమని ఆత్మకూరు పట్టణ తెలుగుదేశం అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, తెలుగుదేశం జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు నిర్ణయం, రాష్ట్ర దేవాదాయశాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదేశాలమేరకు ఆత్మకూరులోని 19వ వార్డులో తెలుగుదేశం పార్టీ సభ్యత్వనమోదు కార్యక్రమం ముమ్మరంగా సాగుతుండగా పాల్గొని పర్యవేక్షించిన తుమ్మల చంద్రారెడ్డి పలువురికి పార్టీ సభ్యత్వ నమోదు కార్డులు అందజేశారు. ఈసందర్భంగా చంద్రారెడ్డి మాట్లాడుతూ.. క్రమం తప్పకుండా సభ్యత్వ నమోదు, సంస్థాగత ఎన్నికలు నిర్వమించేది తమ తెలుగుదేశం పార్టీయేనని పేర్కొన్నారు. తెలుగుదేశం సభ్యత్వం స్వీకరించేవారికి పార్టీలో తగిన గుర్తింపు ఉంటుందని, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో భాగస్వామ్యమయ్యే అవకాశం ఏర్పడుతుందని, దాంతోపాటు వారికి భరోసాగా భీమా సౌకర్యం ఉంటుందని చంద్రారెడ్డి పేర్కొన్నారు. అందువలనే అధికసంఖ్యలో జనాలు స్వచ్ఛందంగా తమ పార్టీలో చేరుతున్నారని తుమ్మల పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగుయువత మాజీ ఉపాధ్యక్షుడు పిడికిటి వెంకటేశ్వర్లునాయుడు, మున్సిపల్ వైస్‌చైర్మెన్ షేక్ సర్దార్, కౌన్సిలర్ గంధళ్ళ వేణు, టీడీపీ నాయకులు కొప్పోలు చిన్నపురెడ్డి, షేక్ నాయబ్‌రసూల్, ఒంటేరు మల్లికార్జునయాదవ్, అనిల్, నాగూర్, గురుప్రసాద్, సోషల్‌మీడియా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సోమశిల ఉత్తరకాలువ వైస్ ధనుంజయకు అభినందనలు

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** సోమశిల ఉత్తరకాలువ వైస్‌చైర్మెన్‌గా ఎన్నికైన పూనుగుంట ధనుంజయను కరటంపాడు తెలుగుదేశం నాయకుడు, మాజీ ఉపమండలాధ్యక్షుడు గార్లపాటి వేణుగోపాల్‌నాయుడు, రాష్ట్ర తెలుగుదేశం కార్యదర్శి దావా పెంచలరావులు



అభినందించారు. ఇటీవల జరిగిన కరటంపాడు సాగునీటిసంఘ ఎన్నికల్లో సాతానుపల్లికి చెందిన పూనుగుంట ధనుంజయ చైర్మెన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం సోమశిల ఉత్తరకాలువ వైస్‌చైర్మెన్‌గా తెలుగుదేశం పార్టీ జిల్లా కమిటీ నిర్ణయించింది. రాష్ట్ర దేవాదాయశాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆశీర్వాదంతో ధనుంజయ సోమశిల ఉత్తరకాలువ వైస్‌చైర్మెన్‌గా ఎన్నికయ్యారు. రైతులకు సేవలందించే అరుదైన అవకాశం లభించిన ధనుంజయను వేణుగోపాల్‌నాయుడు, పెంచలరావు, సర్పంచ్ పూనుగుంట రేవతి, పలువురు తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు అభినందించారు. తనకు అవకాశం కల్పించిన మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, సహకారమందించిన వేణుగోపాల్‌నాయుడు, పెంచలరావులకు ధన్యవాదాలని, తనవంతుగా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేస్తానని, రైతులకు ఉత్తరకాలువ ద్వారా సక్రమంగా సాగునిరందించేందుకు కృషిచేస్తానని, మంత్రి సహకారంతో కాలువ అభివృద్ధికి కృషిచేస్తానని ధనుంజయ పేర్కొన్నారు.

# రేషన్‌కార్డులు, ఫించన్ల కోసం ఎదురుచూపులు

**▸▸ప్రభుత్వం నుండి విడుదల కాని ఉత్తర్వులు ▸▸నిబంధనలు సడలించిఅర్హులందరికీ న్యాయం కోరుతున్న జనాలు**

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** నూతనంగా రేషన్‌కార్డులు, వివిధ రకాల ఫించన్లకు అర్హులైన వారు ప్రభుత్వ ఆదేశాలు, ఉత్తర్వులకోసం ఎదురు చూస్తున్నారు. దరఖాస్తులు చేసుకోవాలంటూ సోషల్ మీడియాలో అప్పుడప్పుడూ కన్పిస్తుందేకానీ ఇంకా ప్రభుత్వం తగిన ఉత్తర్వులివ్వలేదు. అర్హతల నియమావళిని కూడా విడుదల చేయలేదు. అయితే వివిధ పెన్షన్లు, రేషన్‌కార్డులు, సంక్షేమకార్యక్రమాల మంజూరులో అర్హులందరికీ న్యాయం చేయాలని, గతప్రభుత్వంలో ఉన్న నిబంధనలను సడలించాలని వివిధ వర్గాల ప్రజలు కోరుతున్నారు. గత ప్రభుత్వ నిర్ణయాలు అమలు చేస్తే ఇబ్బందికరమని కొందరు, కొన్ని నిర్ణయాలు అమలు చేయకుంటే ఇబ్బందికరమని మరికొందరు అభిప్రాయపడ్డారు. 20సంవత్సరాలకు క్రితం ప్రభుత్వం డిఫారం పట్టాగా రైతులకు ఇచ్చిఉంటే అలాంటివారికి ఫ్రీహెూల్డ్ అంటూ వైసిపి ప్రభుత్వం పలువురు రైతులకు ఫ్రీహెూల్డ్ అంటూ సర్టిఫికేట్లు పంపిణీ చేశారు. ఈ సర్టిఫికేట్ ద్వారా ఆ భూములను విక్రయించుకోవచ్చని, రిజిస్టర్ చేసుకోవచ్చని నిర్ణయించారు. దాదాపు ఏడాదిక్రితం ఈ పర్టిఫికేట్లు ఇవ్వడంతోపాటు ఆన్‌లైన్‌లో ఆయా పొలాలకు సంబంధించి గత ఏడాది ఫ్రీహెూల్డ్ చేయబడిందని నమోదు చేశారు. కానీ తీరా చూస్తే ఈ నూతన ప్రభుత్వం ఫ్రోహెూల్డ్ అంశాన్ని పెండింగ్‌లో ఉంచింది. దాంతో ఆ సర్టిఫికేట్లు పొందిన రైతులు తీవ్ర నిరాశకుగురై ఆవేదన చెందుతున్నారు. తమకు 20సంవత్సరాలకు ముందు ఇచ్చిన డిఫారం పట్టాలు శాశ్వతపట్టాలుగా మారనున్నాయని సంబరపడ్డ రైతులు దిగాలు చెందిన ఉన్నారు. ప్రభుత్వం ఈవిషయమై పరిశీలించిన కొత్తగా ఇవ్వకున్నా ఇప్పటివరకు ఇచ్చిన ఫ్రీహెూల్డ్ అంటూ సర్టిఫికేట్లు ఇచ్చివారికి చెల్లుబాటు అయ్యేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకొని న్యాయం చేయాలని పలువురు రైతులు కోరుతున్నారు.

### ఫించన్లకు గత ప్రభుత్వ నియమాలు పాటించవద్దు

వివిధ రకాల పెన్షన్ల కొనసాగింపు, మంజూరుకు గత వైసీపీ ప్రభుత్వ నియమాలు అమలుచేయవద్దని, చాలామంది తీవ్రంగా నష్టపోతారని అనేకమంది పెన్షనర్లు, పెన్షన్‌కు అర్హులైనవారు కోరుతున్నారు. గత ప్రభుత్వం దారిద్ర్యరేఖకు దిగువనున్న రైస్ కార్డుదారులందరూ అర్హులు కాగా విద్యుత్ వినియోగం నెలకు 300 యూనిట్లు కన్నా అధికంగా ఉందని, ఇంటికొలతలు అధికంగా ఉన్నాయని, నాలుగుచక్రాల వాహనాలున్నాయని, కుటుంబసభ్యులు ఆదాయపన్నులు చెల్లిస్తున్నారంటూ అనేకమందిని అనర్హులుగా చేసి పెన్షన్‌లు రద్దుచేశారు. అర్హులు నూతనంగా దరఖాస్తులు చేసుకునే అవకాశం లేకుండా చేశారు. దాంతో అందరూ లబోదిబో అంటూ తీవ్ర ఆవేదనకు గురికాగా పెన్షన్లను రద్దుచేసి పలువురికి వైసిపి ప్రభుత్వం అన్యాయం చేస్తుందంటూ తెలుగుదేశం నాయకులు గగ్గోలు పెట్టారు. కాగా రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన తెలుగుదేశం ప్రభుత్వం అదే నియమాలను అమలుచేయనుందని, అనర్హులంటూ పలువరి పెన్షన్లకు ముప్పురానుందని, కొత్తగా పెన్షన్ల మంజూరుకు గత నిర్ణయాలు, నియమాలు పాటించనున్నారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. గత నిర్ణయాలు అమలు ఉంటుందా లేదా, తాజా నిర్ణయాలా అనేది ప్రభుత్వం నుండి సచివాలయాకు ఇంకా ఎలాంటి ఆదేశాలు అందలేదంటున్నారు. ఏదేమైనా అర్హులకు నియమావళి అంటూ రైస్‌కార్డుదారులకు నూతన పెన్షన్లు మంజూరుకాకున్నా, ప్రస్తుతం ఉన్న పెన్షన్లు రద్దయినా అనేకమంది నష్టపోయేపరిస్థితి, ఆందోళనకుగురయ్యే పరిస్థితి, అలజడి చెలరేగే పరిస్థితి ఉంటుందని, ప్రభుత్వం పునరాలాలోచించి గతంలో తెలుగుదేశం అమలుచేసిన నియమావళినే ప్రాతిపదికన తీసుకోవాలని, వైసిపి నియమాలు అమలుచేయరాదని, సాధారణ,మద్య తరగతి కుటుంబాలవారు కూడా విద్యుత్ 300 యూనిట్లకన్నా అధికారంగా వినియోగించుకునే పరిస్థితి ఉంటుందని, బిడ్డలు చదువుకుంటూ కనీస అవసరాలను వాడుకూటుంటారని, అలాంటివారిని గమనించాలని, ఆంక్షలపేరుతో పెన్షన్లు రద్దుచేయారాదని అనేకమంది కోరుతున్నారు.

### టిడ్కోగృహాలు మంజూరైనవారికి పట్టాలివ్వాలి

గతంలో తెలుగుదేశం ప్రభుత్వహయాంలో నిర్మించిన టిడ్కో గృహాల నిర్మాణాలను పూర్తిచేసి లాటరీ విధానంలో లబ్దిదారులకు కేటాయించారు. గత వైసిపి ప్రభుత్వం వాటిని గురించి పట్టించుకొనకుండా ఎన్నికలు సమీపించే పరిస్థితిలో మళ్ళీ గృహాలను కేటాయించారు. అయితే ఆత్మకూరులో చూస్తుంటే 1050 గృహాలు కాగా ఇప్పటివరకు ఐదారు వందలమంది అక్కడకు నివాసాలు మార్చుకున్నారు. గతంలో చెప్పిన విధంగా అక్కడ గుడి, చర్చి, మశీదు, పార్కు, స్కూలు, అంగన్‌వాడీ కేంద్రం తదితరాలను ఏర్పాటు చేస్తామని తెలుగుదేశం ప్రభుత్వం ప్రకటించారు. పార్కుకు సంబంధించి మెటీరియల్ కూడా అక్కడకు చేర్చారు. అనంతరం వచ్చిన వైసిపి ప్రభుత్వం వాటి గురించి ఆలోచించిన పాపానపోలేదు. కాగా కొన్ని గృహాలు ఖాళీలుండగా అర్హులు కొందరు దరఖాస్తు చేసుకున్నారు. విఆర్వో, కమీషనర్,ఆర్డీవోల అర్హులుగా ఆమోదించి ఫైనల్‌గా జాయింట్ కలెక్టర్‌కు ప్రాతిపాదించగా అక్కడ కూడా ఆమోదం పొంది గృహాలు మంజూరయ్యాయి. అయితే వారికి పట్టాలిచ్చే సమయానికి రాష్ట్రంలో ప్రభుత్వం మారింది. పట్టాపుస్తకాలపై గత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఫోటోలున్నాయని అధికారులు నిలిపివేశారు. ఈ ప్రభుత్వం ఆపాస్‌బుక్‌లను మార్చి లబ్దిదారులకు పట్టాలివ్వాలని కోరుతున్నారు. ఈవిషయమై ప్రభుత్వం సత్వర నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నారు.

## క్రీడా పోటీల్లో శ్రీ పద్మావతి మహిళా పాలిటెక్నిక్ విద్యార్థుల ప్రతిభ



**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్:** పలమనేరులో రెండు రోజులపాటు జరిగిన రీజినల్ ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ 2024-25 లో తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా పాలి టెక్నిక్ కళాశాల ఓవరాల్ గేమ్స్ ఛాంపియన్ గా నిలిచింది. ఖో ఖో, టేబుల్ టెన్నిస్ సింగిల్స్, డబుల్స్, చెస్, బాడ్మింటన్ డబుల్స్ లో విన్నర్స్ గా, వాలీబాల్ రన్నర్స్ గా, షాట్ పుట్ లో రన్నర్ గా, రన్నింగ్స్ 100 మీ థర్డ్, 200 మీ సెకండ్, 400 మీ సెకండ్, ట్రిబుల్ జంప్ లో థర్డ్ ప్లేస్ లో ఇలా అన్ని క్రీడాంశాలలో ప్రతిభ చాటి ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచింది. విజయం సాధించిన విద్యార్థులను టీటీడీ విద్యాశాఖాధికారి డాక్టర్ వై.నాగరాజు నాయుడు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.అసుంత, కళాశాల సిబ్బంది అభినందించారు.

## జాతీయ విద్యుత్ ఇందన పొదుపు వారోత్సవాలు ర్యాలీ



**తిరుపతి రెవెన్యూ, మేజర్ న్యూస్:** ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఈ నెల డిసెంబరు 14 వ తేదీ నుండి 20 వ తేదీ వరకు జాతీయ విద్యుత్ ఇందన పొదుపు వారో త్సవాలు నిర్వ హించడం జరిగింది. ఇందులో భాగంగా గురు వారం ఉదయం తిరుపతి ఎస్ఈ ఆపరేషన్ సురేంద్ర నాయుడు ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బందితో ర్యాలీ నిర్వ హించారు.ఈ ర్యాలిని ముందుగా ఎస్. ఈ ఆపరేషన్ నుండి ప్రారంభించి స్థానిక ఆర్.డి.ఓ కార్యాలయం వరకునిర్వహించడంజరిగింది.ఈ ర్యాలీ లో కరెంటు ఆదా చేద్దాం భావితరాలకు బరోసానిద్దం అంటూ బ్యానర్లు మరియు ప్లకార్డులు పట్టుకొని నినాదాలు చేశారు. ఈ ర్యాలీలో వారు మాట్లాడుతూ ఈ సందర్భంగా కరెంటునీ ఎలా ఆదా చేసుకోనీ ఉపయోగించుకోవాలని వాటి ఆవశ్యకత ను గురించి ప్రజలకు, రైతులకు, వినియోగదారులకు అవగాహన కల్పించడం జరిగింది. ఎస్ఈ ఆపరేషన్ సురేంద్ర నాయుడుతో పాటు టౌన్ డివిజన్ విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ విన్న కోటి చంద్ర శేఖర్ రావ్, రూరల్ డి.ఈ వాసు రెడ్డి, డి.ఈ.టీ వాసవి లత విద్యుత్ ఏడిలు, ఏఈలు, ఎస్ఈ ఆపరేషన్ మరియు టౌన్ డివిజన్ రూరల్ డివిజన్ విద్యుత్ సిబ్బంది తదితరలు పాల్గొని ర్యాలీ ను విజయవంతం చేయడం జరిగింది.

## తిరుమలకు భక్తుల పాదయాత్ర



**చౌడేపల్లి మేజర్‌న్యూస్:** మండలంలోని శెట్టిపేట గ్రామపంచాయతి కి చెందిన 40 మంది భక్తులు 41 రోజులు గోవిందమాల ధరించి, నలబై ఒక్క రోజు చన్నీటి స్నానమా చరించి, అనునిత్యం గోవింద నామస్మర ణలో, స్థానిక వినాయకుని ఆలయం వద్దే భక్తి శద్దలతో ఇళ్ళకు సైతం వెళ్ళకుండా ఖఠోర దీక్షతో, భక్తిశ్రద్దలతో శెట్టిపేటలో గురువారం ఇరుముడులు ధరించి తిరుమలకు పాదయాత్ర గా వెళ్ళడం జరిగింది. వీరితో పాటుగా వీరి కుటుంబ సభ్యులు కూడా పాదయాత్రగా వెళ్ళడం గమనార్హం.ఈ పాదయాత్రకు స్థానిక నాయకులు అన్నదానం ఏర్పాటు చేశారు.

## కిడ్నీ బాధితులకు మందుల పంపిణీ



తిరుపతి ప్రెస్ క్లబ్,మేజర్ న్యూస్: గురువారం స్థానిక డాలర్స్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ కార్యాలయం నందు డాలర్స్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీ వెంకటేశ్వర ఏపీ స్టేట్ కిడ్నీ పేషెంట్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రామయ్య అధ్యక్షతన కిడ్నీ బాధి తులకు ఉచితంగా మందుల పంపిణీ కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాలర్స్ గ్రూప్స్ అధినేత దివాకర్ రెడ్డి సతీమణి మౌనిక హాజరయ్యి ఆమె చేతుల మీదుగా కిడ్నీ పేషెంట్లకు మందులను అందజేశారు.ఈ సందర్భంగా వెంకటరామయ్య మాట్లాడుతూ..గత 14 సంవత్సరాలుగా తాను డయాలసిస్ చేసుకుంటూ,తోటి కిడ్నీ బాధితులకు ఉచితంగా మందులు ఇంజక్షన్లు ఇప్పించడం జరుగుతోందని అన్నారు. ఈ ఉచిత మందుల పంపిణీకి ఆర్థికంగా సహాయ సహకారాలు అందించిన డాలర్స్ దివాకర్ రెడ్డికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నానని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఓబిసి వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వేపంజేరి దేవానందం, ఆముదాల లక్ష్మమ్మ,సునీత,కృష్ణవేణి రేవతి, లీగల్ సర్వీస్ ఏవి.మహాలక్ష్మి మరియు కిడ్నీ బాధితులు పాల్గొన్నారు.

## తిరుపతిలో మహిళ దారుణహత్య



**తిరుపతి బ్యూరో, మేజర్ న్యూస్:** తిరుపతి అలిపిరి పోలీస్ స్టేషన్ పరిధిలో సింగాలగుంటలో నివాసముంటున్న తన అక్క బావ మధ్య గొడవలకు బావ తల్లి ముఖ్య కారణమని భావించిన విజయకృష్ణ బావ తల్లి అయిన దాక్షాయిని (55) పై అర్ధరాత్రి కత్తితో దాడిచేశాడు విజయకృష్ణ. గాయపడిన దాక్షాయిని ని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు, చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది, విషయం తెలుసుకున్న అలిపిరి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు,దాక్షాయిని బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయనున్న అలిపిరి సిఐ రామకిషోర్.



## విద్యుత్ పొదుపు ను పాటిద్దాం భావితరాలకు వెలుగునిద్దాం

### - ఏపీ ఎస్పీడీసీఎల్ ఎస్ ఈ ఇస్మాయిల్ అహ్మద్

**చిత్తూరు అర్బన్, మేజర్ న్యూస్:** విద్యుత్ పొదుపును పాటించి భావితరాలకు వెలుగునిద్దామని ఏపీ ఎస్పీడీసీఎల్ ఎస్ ఈ ఇస్మాయిల్ అహ్మద్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇంధన పరిరక్షణ మిషన్ ఇందన శాఖ ఆధ్వర్యంలో ఈనెల 14 నుండి 20 వరకు జరుగుతున్న జాతీయ ఇందన పొదుపు వారోత్సవాల భాగంగా గురువారం జిల్లా కేంద్రంలో వివేకానంద విగ్రహం నుండి గాంధీ సర్కిల్ వరకు విద్యుత్ శాఖ ఉద్యోగులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ ఈ మాట్లాడుతూ ఇంధన పొదుపుపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి ఈ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ ర్యాలీ కార్యక్రమంలో ఈ ఈ మునిచంద్ర, డి ఈ లు, ఎ ఈ లు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం వేడుకలు

**పలమనేరు, మేజర్ న్యూస్ :** ఆశాజ్యోతి దివ్యాంగుల పేద ప్రజల సేవా సమితి వారి ఆధ్వర్యంలో డిసెంబర్ నెల 65వ అంతర్జాతీయ దివ్యాం గుల దినోత్సవ వేడుకలు ఈనెల 24వ తేదీనిర్వహిస్తారు. పట్టణంలో గత రెండు సంవత్సరాలుగా దివ్యాంగులు నిరుపేదలు అనాథలను ఆదుకోవడం లక్ష్యంగా వారి ఆరోగ్య ఆర్థిక సాంఘిక సమస్యలకు తమ వంతు సేవలు అందించడానికి నిస్వార్ధంగా ముందుకు వచ్చిన స్వచ్ఛంద సేవకులతో రూపుదిద్దుకోబడిన సంస్థ ఆశాజ్యోతి దివ్యాంగుల పేద ప్రజల సేవాసమితి సంస్థ. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ పరిధిలోని దివ్యాంగులు నిరుపేదలు ముఖ్య అతిథులు ప్రతి ఒక్కరూ తప్పకుండా హాజరై ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

## నేటి నుండి 29 వరకు ఖాదీ మహోత్సవం ఎగ్జిబిషన్

### : కె వి ఐ సి డిప్యూటీ సి ఈ ఓ మదన్ కుమార్ రెడ్డి



**తిరుపతి రూరల్, మేజర్ న్యూస్:** ఈ నెల 20 నుండి 29 వరకు ఖాదీ మహోత్సవం ఎక్సిబిషన్ నిర్వహణ జరుగుతుందని ఈ అవకాశాన్ని తిరుపతి జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకుని ఖాదీ ఉత్పత్తులను ప్రోత్సహించాలని ఖాదీ అండ్ విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్ డిప్యూటీ సి ఈ ఓ మదన్ కుమార్ రెడ్డి అన్నారు. గురువారం మద్యాహ్నం స్థానిక శిల్పారామం నందు రాష్ట్ర స్థాయి మార్కెటింగ్, పీఎం ఈ జి పీ ఎక్సిబిషన్ ఏర్పాటుపై ఖాదీ అండ్ విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్ డిప్యూటీ సి ఈ ఓ విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా కె వి ఐ సి డిప్యూటీ సి ఈ ఓ మాట్లాడుతూ.. ఈ నెల 20 నుండి 29 వరకు ఖాదీ మహోత్సవం ఎక్సిబిషన్ నిర్వహణ జరుగుతుందని ఈ అవకాశాన్ని తిరుపతి జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకుని ఖాదీ ఉత్పత్తులను ప్రోత్సహించాలని అన్నారు. పీ ఎం ఈ జి పీ , ఖాదీ రెండు యూనిట్ లు ద్వారా శిల్పారామంలో 100 స్టాల్స్ ఏర్పాటు తో గ్రామ పరిశ్రమలు ద్వారా , ఖాదీ ఉత్పత్తులతో తయారు చేసిన వస్తువులు ప్రదర్శన, ఖాదీ ఉత్పత్తులు, గ్రామీణ, హస్తకళలు, కలంకారీ, తోలు ఉత్పత్తులు, పీ ఎం ఈ జి పీ ఉత్పత్తులు ప్రదర్శన ఉంటుందని తెలిపారు. ఈ సంస్థ సూక్ష్మ, చిన్న మద్య తరహా ఎంటర్ ప్రైజెస్ క్రింద 1956 లో ఏర్పాటు అయిన సంస్థ అని దీని ద్వారా గ్రామీణ ఉత్పత్తులు , ఖాదీ ఉత్పత్తులను ప్రోమోట్ చేయడం ద్వారా గ్రామీణ ఉద్యోగ కల్పన ముఖ్య ఉద్దేశమని అన్నారు. తిరుపతి, జిల్లా ప్రజాలలందరు ఈ ఖాదీ మహోత్సవాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం ఖాదీ మహోత్సవ పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కె వి ఐ సి డైరెక్టర్ ఎస్. గ్రీప్, ఎ డి కోటి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ మీడియా వెల్ఫేర్ సెక్రటరీగా షేక్ ఆసీఫ్



**కోట, మేజర్ న్యూస్:** పట్టణానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ షేక్ ఆసీఫ్ నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ తిరుపతి జిల్లా మీడియా వెల్ఫేర్ సెక్రటరీ (క్రైమ్-వైలెన్స్-కరప్షన్ విభాగం)గా నియమితులైనారు.నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఛైర్మన్ డాక్టర్ సంపత్ కుమార్ నుండి నియామక ఉత్తర్వులు అందుకొన్నారు. నియామక పత్రాలు అందుకున్న సందర్భంగా ఆసిఫ్ మాట్లాడుతూ నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఛైర్మన్ డాక్టర్ సంపత్ కుమార్ తో పాటు కౌన్సిల్ నాయకులకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.భారతదేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని నీతి ఆయోగ్, మినిస్ట్రీ ఆఫ్ కార్పొరేట్ ఎఫైర్స్, మినిస్ట్రీ ఆఫ్ సోషల్ జస్టిస్ అండ్ ఎంపవర్మెంట్, గవర్నమెంట్ ఆఫ్ ఇండియాచే నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ రిజిస్టర్ కాబడిందన్నారు . ఈ సందర్భంగా తిరుపతి జిల్లా వ్యాప్తంగా పలువురుఅసీఫ్ కు అభినందనలు తెలిపారు.

## సంగం డెయిరీ కుర్చీలు పంపిణీ



శాంతిపురం, మేజర్ న్యూస్: కడపల్లి లోని అంబేద్కర్ గురుకుల పాఠశాలకు గురువారం సంఘం డైరీ రీజనల్ మేనేజర్ వైపి వెంకటేశ్వర్లు చేతుల మీదుగా 30 వేల రూపాయల విలువగల కుర్చీలను అందించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శాంతిపురం మండల అధ్యక్షులు విశ్వనాథ పాల్గొన్నారు. గురుకుల పాఠశాలకు కుర్చీలు అవసరమని తమకు తెలుపగా విద్యార్థులకు అదే విధంగా అధ్యాపకులకు ఉపయోగపడుతుందని ఉద్దేశ్యంతో సంఘం డైరీ చైర్మన్, పొన్నూరు తెలుగుదేశం పార్టీ శాసనసభ్యులు ధూళిపాల నరేంద్ర వారి ఆదేశానసారం పాఠశాలకు కుర్చీలను అందించడం జరిగిందని డా. వైపి వెంకటేశ్వర్లు తెలిపారు. తమ పాఠశాలకు కుర్చీలు వితరణ చేసినందుకు పాఠశాల ప్రిన్సిపల్ సంఘం డైరీ వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిస్టిక్ కోఆర్డినేటర్ పద్మజ, సంఘం డైరీ మేనేజర్ శ్రవణ్ కృష్ణ, శ్రీనాథ్ పాల్గొన్నారు.

## అరగొండలో వ్యవసాయ రైతు సదస్సు



**ఐరాల, మేజర్‌న్యూస్:** తవణంపల్లి మండలంలో చిత్తూరు ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలోని అర గొండ గ్రామంలో తిరుపతి వ్యవసాయ కళాశాల విద్యార్థులు గురువారం ఏర్పాటు చేసిన వ్యవసాయ ప్రదర్శన అందరినీ అకట్టుకుంటుంది. గ్రామీణ కృషి అనుభవం కార్యక్రమంలో భాగంగా చిత్తూరు ఏరువాక కేంద్రానికి అను సంబంధించిన విద్యార్థులు పవనంపల్లి మండలంలోని అరగొండ దిగువమాగం చెర్లోపల్లి గ్రామాలలో మూడు నెలల పాటు రైతులలో రైతులతో కలసి వ్యవసాయం, అనుబంధ రంగాల కార్యక్రమాల్లో రియాజ్ ఏలకంగా పాల్గొని అనుభవాన్ని పొందారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ ఎంవి రమణ, ఎస్ వి కళాశాల, తిరుపతి డిఎంఓ మధుసూదన్ రెడ్డి, విశిష్ట అతిధి డాక్టర్ డి వి సుమతి, అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్, చిత్తూరు సభాధ్యక్షులు డాక్టర్ బి సంధ్యారాణి, సమన్వయకర్త ఏరువాక కేంద్రం చిత్తూరు అతి డి వై రెడ్డి రాము, ఆచార్యులు, ఎస్ వి వ్యవసాయ కళాశాల, తిరుపతి జి ప్రవీణ్, ఆనం పల్లి మండలం వ్యవసాయ ప్రదర్శనలు విద్యార్థులు టెర్రస్ షర్మింగ్, హైడ్రోపోనిక్స్ మల్చింగ్ డ్రోన్ల వినియోగం, సమీకృత వ్యవసాయ పద్ధతులు అడవి పందుల నుండి పంటలను కాపాడుట బింధు తుంపర సేద్యం మొదలైన అంశాలను వివిధ రకాల మోడల్స్ ద్వారా అవగాహన కల్పించారు. మండల అగ్రికల్చర్ ఆఫీసర్ ప్రవీణ్ మాట్లాడుతూ రైతు లేరుకునే ఎస్ సమస్యలకు తగిన సూచనలు సలహాలను అందించారు.

## ఉమ్మడి జిల్లాలు ఫెన్సింగ్ జిల్లా జట్ల ఎంపిక

**తిరుపతి బ్యూరో, మేజర్ న్యూస్:** ఉమ్మడి జిల్లాలు ఫెన్సింగ్ సంఘం ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం నాలుగు గంటలకి తిరుపతిలోని శ్రీ శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ వేదికగా సీనియర్. స్రీ పురుషుల ఫెన్సింగ్ జిల్లా జట్ల ఎంపికలు నిర్వహించారు. అందులో ప్రతిభ చూపిన క్రీడాకారులను ఎంపిక చేసి ఈనెల 21 నుండి 23వ తేదీ వరకు విజయవాడ పట్టణంలోని హాలు లో జరుగు రాష్ట్రస్థాయి అంతర్ జిల్లాల ఫెన్సింగ్ టోర్నీలో పాల్గొంటారని జిల్లా ఇన్చార్జి .పీ. గీత. తెలియజేశారు. ఈ ఎంపికల కార్యక్రమానికి అతిథిగా విచ్చేసిన జిల్లా ఒలంపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి. శ్రీధర్ మాట్లారు.

## సచివాలయ సిబ్బందికి శిక్షణ

**పుంగనూరు, మేజర్ న్యూస్:** పట్టణంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ నందు సచివాలయ సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు బుధవారం, గురువారం జరిగాయి ఈ కార్యక్రమం ఎంపీడీవో లీలా మాధురి అధ్యక్షతన నిర్వహించారు ఈ కార్యక్రమంలో డి ఎల్ డి ఓ శేషాద్రి మాట్లాడుతూ పంచాయతీ సచివాలయ సిబ్బంది గ్రామం అభివృద్ధి , మౌలిక వసతులరూపకల్పనలో భాగంగా స్వచ్ఛమైన తాగునీరు, పారిశుధ్యం పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారులు ఎంపీడీవో సిబ్బంది పంచాయతీ రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు



# ఉదయగిరిలో డయాలసిస్ ఏర్పాటుకు ప్రతిపాదనలు

## వైద్యశాల అభివృద్ధికి చర్యలు : ఎమ్మెల్యే కాకర్ల సురేష్



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ఉదయగిరి సామాజిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధికి అన్ని విధాల చర్యలు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే, హెచ్‌ఎమ్ కమిటీ చైర్మన్ కాకర్ల సురేష్ పేర్కొన్నారు. గురువారం స్థానిక వైద్యశాలలో చైర్మన్ అధ్యక్షతన వైద్యశాల అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా కేంద్రానికి సుదూర ప్రాంతంలో ఉన్న ఈ వైద్యశాలలో వైద్యులు, సిబ్బంది కొరత తీర్చేందుకు ఇప్పటికే ఉన్నతాధి కారుల దృష్టికి తీసుకెళ్లానన్నారు. మెట్ట ప్రాంతం కావడంతో పేదలు అధికంగా ప్రభుత్వ వైద్యశాలకు వస్తుంటారన్నారు. వారిని దృష్టిలో ఉంచుకొని వైద్యశాలలో అన్ని సేవలు అందుబాటులోకి తీసుకొచ్చి మెరుగైన వైద్యసేవలు అందేలా కృషి చేస్తామన్నారు. అలాగే వైద్యశాలలో నెలకొన్న సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై వైద్యులతో చర్చించారు. పారిశుధ్యం సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. అనంతరం సమావేశంలో వైద్యశాలలో చేపట్టిన, చేపట్టాల్సిన అభివృద్ధి పనులను అజెండాలో ఉంచి సభ్యులకు చదివి వినిపించారు. కార్యక్రమంలో డీడీవో అనీషా, వైద్యులు సింధూర, ప్రశాంత్, ఎంపీడీవో అప్పాజీ, ఈవో కరీముల్లా, హెచ్‌ఎమ్ సభ్యురాలు కలివెల జ్యోతి, మండల టీడీపీ కన్వీనర్ బయ్యన్న, టీడీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడు షేక్ రియాజ్ బొజ్జ నరసింహులు, నల్లిపోగు నరసింహులు పాల్గొన్నారు.

# ఎంపీ వేమిరెడ్డి వినతులపై కేంద్రమంత్రుల సానుకూల స్పందన



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** జిల్లా ప్రజల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకువెళ్లిన సమస్యలపై వారు సానుకూలంగా స్పందించారు. పార్లమెంట్ సమావేశాల సందర్భంగా ఎంపీ జిల్లాలో సమస్యలను కేంద్రమంత్రుల దృష్టికి తీసుకువెళ్లారు. ఆయా శాఖల పరిధిలో ప్రజలకు అందాల్సిన సేవలు, ఏర్పాటు చేయాల్సిన వసతులు, సమస్యలను మంత్రులకు వివరించారు. విడవలూరు మండలం పొన్నపూడి పాటూరులో ఫిషింగ్ జెట్టీ ఏర్పాటు కోరుతూ కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ సింగ్‌ను కలిసి ఎంపీ వినతి పత్రం అందించారు. అలాగే ఓబీసీ లబ్ధిదారులకు ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన కింద ఇస్తున్న డీప్‌సీ బోట్లకు సబ్సిడీని పెంచాలని కోరారు. దీనిపై కేంద్రమంత్రి స్పందిస్తూ.. ఎంపీ దృష్టికి తెచ్చిన సమస్యలను పరిశీలించి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే నెల్లూరులో ఈఎస్‌ఐ ఏర్పాటు చేయాలని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కోరగా.. కేంద్ర లేబర్, ఎంప్లాయ్‌మెంట్, యూత్ మినిస్టర్ మన్‌సుఖ్ మాండవీయ స్పందిస్తూ.. ఎంపీ వినతిని పరిశీలించి అందుకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

# అయ్యప్ప గుడిలో మండల పూజలు





**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు స్థానిక వేదయపాలెం లో వేంచేసియున్న వేద శాస్త్ర స్వామిఅయ్యప్ప స్వామి దేవస్థానంలో అయ్యప్ప స్వామి వారికి కేరళ సాంప్రదాయ కార్తీకమాస మండల పూజలు గురువారం ఘనంగా జరిగింది. ఉదయం పాలాభిషేకం, మహాగణపతి హెూమం, ఉష పూజ, నవకాభిషేకం, ఉచ్ఛపూజ,శ్రీ వేలి ఉత్సవం, సాయంత్రం మహాదీపారాధన, భగవతి సేవా, అత్తాళ్ళ పూజ, శ్రీ వేలీ ఉత్సవం, పడి కర్పూరం, హరివరాసనం, కార్యక్రమాలు కేరళ తంత్రులచే ఘనంగా జరిగాయి. మండల పూజలకు నారపరెడ్డి మధుసూధన్ రెడ్డి శ్యామలమ్మ దంపతులు, మధ్యాహ్నం అన్నదానం ఉభయకర్తలుగా నారపరెడ్డి మధుసూదనరెడ్డి శ్యామమలమ్మ దంపతులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు గూడల శేషగిరిరావు, కార్యదర్శి కత్తుల వెంకటరత్నం, కోశాధికారి గడ్డం రత్నయ్య, కత్తి మోహన్ రావు, గడ్డం విజయకుమార్, పావలా ప్రసాదు పలువురు అయ్యప్ప స్వాములు భక్తులు పాల్గొన్నారు.

## డివైడర్ పై ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవు



**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :** ముంబై జాతీయ రహదారి డివైడర్‌పై ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవని బుచ్చిరెడ్డిపాలెం నగర పంచాయతీ నగర కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి హెచ్చరించారు. వ్యాపారస్తులు, రాజకీయ పార్టీ నాయకులు ఎవరు కూడా ఫ్లెక్సీలను ఏర్పాటు చేయవద్దని సూచించారు. ఎవరైనా నిబంధనలను అతిక్రమిస్తే జరిమాన విధిస్తామని తెలిపారు. పట్టణంలోని వ్యాపారస్తులు, వివిధ పార్టీలకు చెందిన రాజకీయ నాయకులు, ప్రజలు తమకు సహకరించాలని కోరారు.

## ఆత్మకూరులో జడివాన, చలిగాలి

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు పట్టణంలో, మండలంలో, డివిజన్‌లోని అన్ని మండలాల్లో బుధవారం తెల్లవారుఝామున ఆరంభమైన వర్షం ఎడతెరిపిలేకుండా కురుస్తోంది, బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఓమోస్తరు వర్షం ఏమాత్రం ఎడతెరిపిలేకుండా కురుస్తుండగా ఆకాశం తీవ్రంగా మేఘావృతమై భారీవర్షం కురిసేలా తలపిస్తోంది, ఈ వర్షానికి జనాలు హర్షం వ్యక్తం చేస్తుండగా రైతుల్లో అధికశాతం మంది సంతోషిస్తుండగా ఖరీఫ్‌సీజన్‌లో వరిసాగుచేసి కోతదశలో ఉన్న రైతులు, ఇటీవలనే నార్లుపోసిన రైతులు కొంత నష్టపోయేలా ఉన్నామని బాధపడుతున్నారు. పొగాకు రైతులు మాత్రం ఎంతోసంతోషంగా ఉన్నారు. కాగా ఈ వర్షం వలన ఎక్కడబడితే అక్కడ నీరు నిల్వచేరడం, రోడ్లు జలమయమవడంతోపాటు లోతట్టు ప్రాంతాలు బురదమయం కావడంతో జనజీవనానికి అసౌకర్యంగా ఉంది. కాగా ఈ వర్షాలు ఆరంభంకాగానే స్తానిక ఆర్డీవో బి.పావని డివిజన్‌లోని అందరు తహశిల్దార్లు, అన్ని శాఖల అధికారులను అప్రమత్తం చేశారు. లోతట్టు ప్రాంతాలు, నదీతీరప్రాంత గ్రామాలను కూడా పరిశీలించి అక్కడి ప్రజలను కూడా అప్రమత్తం చేశారు. వర్షంవలన చలిగాలులు అధికంగా ఉన్నాయి.



## రిజిస్ట్రేషన్ శాఖకు సమగ్ర సమాచారం అందించండి : అదనపు కమిషనర్ నందన్



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను అనుసరించి స్టాంపులు, రిజిస్ట్రేషన్‌ల శాఖ ఐజీఆర్‌ఎస్ వెబ్‌సైట్‌లో నమోదు చేసేందుకు అవసరమైన సమగ్ర వివరాలను ఆ శాఖకు అందించాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ నందన్ రెవెన్యూ విభాగం అధికారులను ఆదేశించారు. నగర పాలక సంస్థలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో గురువారం స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ నగర పాలక సంస్థ రెవెన్యూ విభాగం సిబ్బందితో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ.. ఇంటి నెంబర్లు, ఎరియాలు డివిజన్ల వారీగా ప్రణాళికాబద్ధంగా వెబ్‌సైట్‌లో అప్లోడ్ చేసేందుకు అవసరమైన పూర్తి వివరాలను అందించాలని సూచించారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ చెన్నుడు జిల్లా రిజిస్టర్ హరివర్మ సబ్ రిజిస్టర్ సింహాద్రి నాయుడు రెవెన్యూ అధికారి ఇనాయతుల్ల, రెవెన్యూ ఇన్స్‌ఫెక్టర్లు, పరిపాలనా కార్యదర్శులు పాల్గొన్నారు.

## విద్యావనరుల కేంద్రంలో ఆధార్‌సెంటర్ ఏర్పాటు



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరులోని మండల విద్యావనరుల కేంద్రంలో ఆధార్‌నమోదు కేంద్రాన్ని బుధవారం ప్రారంబించామని, శుక్రవారం వరకు కొనసాగిస్తామని మండల విద్యాశాఖాధికారిని ఎం.జ్యోతి పేర్కొన్నారు. మండలంలోని పాఠశాలల్లో విద్యార్థులకు ఆధార్‌కార్డులు లేకుంటే అలాంటివారిని ఎంఆర్‌సికి తరలించి ఆధార్ నమోదు చేయించుకోవాలని ఎంయివో కోరారు. విద్యార్థుల సౌలభ్యం కోసం ఆధార్‌నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, అందరూ ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

## నిర్ణీత గడువులో సమస్యలు పరిస్కారం

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ఉదయగిరి, మండలంలోని కోటయపల్లి గ్రామంలో గురువారం తహసీల్దారు సుభద్ర ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై ప్రజలు, రైతులు వినతులు సమర్పించారు. ప్రజలు అందజేసిన అర్జీలకు త్వరితగతిన పరిష్కారమార్గం చూపుతామని ఆమె తెలిపారు. ఈ కార్య క్రమంలో డీటీ హసీనా, వీఆర్వోఅంజాద్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.